# కవిత్వీకరణ

ఆకృతి లేని ప్రాణమై
ఏదో ఆలోచన లీలగా
మనసులో మెదిలీ మెదలగానే
నా పంచరంగుల పాళీని
వెన్నెల రేకుల కాగితాల్ని
ప్రోగు చేసుకుని కూర్చుంటాను
కారణం తెలియని అశాంతి
ఉపశమించని వేదనై
నాలో సుళ్ళు తిరుగుతుందే కానీ
ఒక్క అక్షరం కూడా సాక్షాత్కరించదు!!!
కనిపించని గాయంలా నన్ను బాధించి
పాదరసమై జిగిబిగిగా ప్రవహించి
అంతలోనే ఆవిరై మాయమై పోయే
కవిత్వాన్ని నా వేలికొనలతో అపురూపంగా
పట్టుకుందామని ఎంత ప్రయత్నిస్తాను!!!
రోజంతా అల్లరితో వేధించి
అందకుండా పరుగులెట్టే తనను చూసి
దిగాలుగా కూర్చున్న యశోదపై జాలిపడి
తనంత తానుగా అమ్మ చేతుల మధ్య
బందీ అయ్యే చిన్ని కృష్ణుడిలా
పదికాగితాలు చింపి పారేసి
అలసి మాగన్నుగా నిద్రపోయేవేళ
చిరునవ్వుతో చేతిపై తట్టి
నా కవిత్వం కన్నుల ముందు
చిద్విలాసంగా నిలబడుతుంది

---వైదేహి శశిధర్